



వన్యప్రాణులకు స్వర్గసీమ పాకాల

తెలంగాణకే తలమానికం.. ఈ అభయారణ్యం

- అటవీజంతువులకు సేఫ్‌జోన్
- అరుదైన పక్షిజాతులకు ఆవాసం
- వలస పక్షుల సంరక్షణకు అటవీశాఖ చర్యలు
- అతిథులకు కనువిందు చేస్తున్న వైనం



పాకాల అభయారణ్యంలో సంచరిస్తున్న వన్యప్రాణులు, పక్షులు







అడవిలో ఏర్పాటు చేసిన నీటి తొట్టిలో నీటిని నింపుతున్న సిబ్బంది

గూడూరు, ఏప్రిల్ 22 : చిత్తడి నేలలు, కాలుష్య రహిత సరస్సు, అనేక రకాల వృక్షాలతో పాకాల అభయారణ్యం పక్షులు, జంతులకు అభయమిస్తోంది. విలువైన అటవీసంపద, ఆయుర్వేద వనమూలికలు, ప్రకృతి పరిచిన పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణం, ఎత్తైన కొండలు, జలపాత సోయగాలు వర్ణానాతీతం. అటవీప్రాంతం ఎక్కువ ఈ కారణాలతో వన్యప్రాణులకు సేఫ్‌జోన్‌గా మారింది. సహజసిద్ధమైన రక్షణకు తోడు అటవీశాఖ అధికారులు తీసుకున్న ప్రత్యేక చర్యలతో తెలంగాణ రాష్ట్రంలోనే వన్యప్రాణుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతంగా గుర్తింపు పొందింది. శాఖహార జంతువుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విస్తారమైన గడ్డి క్షేత్రాలు, తాగునీటి కోసం సాసర్లు, ఊట కుంటలు, సోలార్ బోర్లు ఏర్పాటు చేయడం వల్ల శాఖహార జంతువుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. పాకాల అటవీ విస్తీర్ణం 839 చదరపు కిలోమీటర్లు ఉంటుంది. అటవీప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పగ్‌మార్క్‌ల ఆధారంగా వన్యప్రాణుల గణన నిర్వహిస్తారు. కవ్వాల్ టైగర్ జోన్‌తో పోలిస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వన్యప్రాణులకు పాకాల సేఫ్‌జోన్‌గా మారిందని అధికారులు చెబుతున్నారు.

వలస పక్షులకు ఆవాసం ..

వరంగల్-మహబూబాబాద్, ములుగు జిల్లాలలోని పాకాల అభయారణ్యం వలస పక్షులకు, వన్యప్రాణులకు (పాకాల వైల్డ్ లైఫ్ సాంచూరి) విడిది ప్రాంతంగా నిలుస్తోంది. ఇక్కడ 165 రకాల స్థానిక పక్షులు, 60 రకాల వలస పక్షులు మనుగడ సాగిస్తున్నాయి. పాకాల ఆభయారణ్యంలో పక్షులకు అనువైన జీవవైవిధ్యం, పరిసర ప్రాంతాల్లో చెరువులు, కుంటలు ఉండడంతో పాటు నీరు ఉండడం ద్వారా ప్రతియేట 50 నుంచి 60 రకాల పక్షులు వలస వస్తాయి. ఆతిథ్య కేంద్రంగా విహారస్థలంగా విరజిల్లుతున్న ఈ ప్రాంతంలో పక్షుల అవాసాలకు జీవ మనుగడకు అనువైన ప్రదేశాలు ఉండడంతో ఆయా కాలలను అనుసరించి పక్షులు వలస వస్తున్నాయి. ముఖ్యంగా సైబిరియా, ఆస్ట్రేలియా, రష్యా, హిమాలయాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి పక్షులు దక్షణ భారతదేశంలోని తెలంగాణకు చేరుకుంటాయి. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాకాల అభయారణ్యం అడవుల్లో పక్షుల కిలకిల రాగధ్వనుల సందడి నెలకొంది. రంగురంగుల ఈకలు... చూడచక్కని ముక్కులతో కొమ్మా రెమ్మలపై ఎగురుతూ.. నింగిలో ఆహ్లాదకరమైన విన్యాసాలు చేస్తూ వినసోంపైనా కిల..కిల రాగాలతో పాకాల అభయారణ్యం అడవులకు వలస పక్షులు మరింత అందాన్ని తీసుకువచ్చాయి. అడవుల్లో పక్షులకు, జంతువులకు ఆహారం సమృద్ధిగా లభిస్తుంది. దీంతో ఉత్తర భారతదేశంతో పాటు వివిధ ప్రాంతాలు, దేశాల నుంచి అరుదైన పక్షులు పాకాల అభయారణ్యాన్ని విడిదిగా ఎంచుకున్నాయి.

వలసపక్షులు ఎదుర్కొంటున్న సమస్యలు...

గడిచిన కొన్ని సంవత్సరాలతో పోల్చుకుంటే ఇటీవల కాలంలో వలస పక్షుల రాక ఘననీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. చెరువులు, కుంటలు కృత్రిమ పద్ధతిలో రిజర్వాయర్లుగా మార్చడం, లేదా మరమ్మతులు చేయడం ద్వారా జలచర జీవుల కొరత ఏర్పడి ఆహారం లభించక పక్షుల వలసలు తగ్గిపోన్నాయి. దీనికి తోడు ప్లాస్టిక్ వ్యర్థాలు, బయో వ్యర్థాలను చెరువుల్లో వేయడం, ఫ్యాక్టరీల ద్వారా వెలువడే వ్యర్థాలు సమీప చెరువుల్లోకి, చిత్తడి నేలలోకి వదలడం ద్వారా నీరంతా కలుషితమవడంతో పక్షులు రకరకాల వ్యాధుల భారిన పడి మృత్యువాత పడుతున్నాయి. పంట చేలలో చల్లే విష గుళికలతో అవి తిన్న పక్షులు చనిపోతున్నాయి. అడవి విస్తీర్ణం తగ్గడం, పక్షుల వేట పెరగడం, వలసలు తగ్గడానికి ప్రధాన కారణం.

ఆహార అన్వేషణ...

వలస పక్షులు దాదాపు అన్ని మాంసహారులే... కొంగ జాతికి చెందిన పక్షులు చేపలు, నత్తలు, కప్పలను ఎక్కు వగా తింటాయి. బాతుజాతికి చెందిన రెడ్ క్రెస్టెడ్ పోచ ర్డ్, నార్తర్‌పిన్‌టేయిన్స్, గ్రిబు, విజిలింగ్‌డక్స్ లాంటివి చేపలు, ఎండ్రుకాయలు, ఇతర పురుగులను ఆహారంగా తీసుకుంటాయి. కూట్సులాంటి పక్షులు నాచును తీసు కుంటాయి. వలస పక్షుల సంతనోత్పత్తి కాలం డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఉంటుంది.

ప్రధాన శాఖహార జంతువుల సంఖ్య..

శాఖహార జంతువుల్లో నక్కలు 217, కుందేళ్లు 4126, అడవి పందులు 8849, అడవి దున్నలు 3691, కొండ గొర్రెలు 2595, సాంబార్ 1000, ఎలుగుబంట్లు 129, చుక్కల దుప్పులు 1274, హైనలు 71, ముళ్ల పందులు 1000, పునుగు పిల్లలు 1123, అడవి పిల్లులు 503, కనుజులు 102, కొండనాగులు 1620, వీటితో పాటు వేల సంఖ్యలో బిట్టు ఉడతలు, కొండముచ్చులు, కోతులు, తోడేళ్ల, మనుబోతులు, రేసుకుక్కలు, ముషిక జింకలు, ముంగీసలు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు అంచనాలు వేశారు.

వన్యప్రాణులు, వలస పక్షుల సంరక్షణకు కృషి

- బి.విశాల్, డీఎఫ్‌వో



పాకాల అభయారణ్యంకు వచ్చే వన్యప్రాణులు, వలసపక్షుల సంరక్షణ కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. వాటి ఆహార అన్వేషణపై అధ్యయనం చేస్తున్నాం. గడ్డి జాతి మొక్కలను పెంచుతున్నాం. గ్రామీణా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. పక్షులు, వన్యప్రాణుల విడిదికి అవసరమైన వనరులను ఏర్పాటు చేస్తున్నాం.



అట్టడుగు వర్గాల అభ్యున్నతికి బీజేపీ కృషి

- సీతారాంనాయక్‌ను గెలిపిస్తే జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం
- కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెణ్ రిజిజు
- సీతారాంనాయక్ నామినేషన్ దాఖలుకు హాజరు

మహబూబాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాల అభ్యున్నతికి బీజేపీ కృషి చేస్తోందని, మానుకోట పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే జిల్లాలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెణ్ రిజిజు పేర్కొన్నారు. సోమవారం బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఉదయం 11.40 గంటలకు హెలీకాప్టర్‌లో మహబూబాబాద్ ఎన్టీఆర్ సమీపంలోని హెలీప్యాడ్‌కు చేరుకున్న ఆయనకు పార్టీ కార్యకర్తలు, మహిళలు, ఆదివాసీలు బోనాలు, బతుకమ్మ, కోయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం 12.45 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఓపెన్‌టాప్ వాహనంలో తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్‌షో నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో రిజిజు మాట్లాడుతూ మానుకోట ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే ఇక్కడ ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని, దీంతో జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. మహిళలు, ఆదివాసీలు, గిరిజనులు, రైతుల అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, ఆదివాసీ బిడ్డనైన తనకు మోదీ మంత్రి వర్గంలో అవకాశం కల్పించారని, అదే విధంగా ఆదివాసీ మహిళను రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీదేన్నారు. కేంద్రంలో మళ్లీ మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని, త్వరలోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషి : సీతారాంనాయక్

మహబూబాబాద్ జిల్లాలో గిరిజనులు, ఆదివాసీలు ఎక్కువగా ఉన్నారని, వారు విద్య, ఉద్యోగాలకు ఆమడదూరంలో ఉన్నారని, వారి బంగారు భవిష్యత్ కోసం జిల్లాకు స్కిల్ డెవలప్‌మెంట్ యూనిట్‌ను తీసుకువస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ హామీ ఇచ్చారు. మహబూబాబాద్‌కు కేంద్రంతో మాట్లాడి ఫ్లైఓవర్ బ్రిడ్జి మంజూరు చేయిస్తానని, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు, భద్రాద్రి కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు మంజూరుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓట్లు వేస్తే ఫలితం ఉండదని, కేంద్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని, తనను గెలిపిస్తే మానుకోటను ఉన్నతస్థాయికి తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజవర్ధన్‌రెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, క్యాచువల్ శ్యాసుందర్‌శర్మ, మోసంగి మురళి, హైండ్ల శ్రీనివాస్, ప్రబారి నూకల వెంకటనారాయణరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ ముసుకు శ్రీనివాస్‌రెడ్డి, వద్దిరాజు రాంచందర్‌రావు, ఆకుల శ్రీనివాస్, చీకటి మహేష్‌గౌడ్, దార ఇందుభారతి, రాంబాబు, రాచకొండ కొమురయ్య, బలరాం, గంట రవికుమార్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషిచేస్తా

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్




అమ్మాపురం పెద్దమ్మగుడిలో పూజలు చేస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 22 : ముదిరాజ్‌ల అభివృద్ధికి అనునిత్యం కృషి చేస్తానని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. తొర్రూరు మండలం అమ్మాపురంలో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ముదిరాజ్ కుల బంధువులు సమష్టిగా కులదైవం ఆల య నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపనచేయడం సంతోషకరమన్నారు. గ్రామ ప్రజలు సుఖసం తోషాలు, పాడి పంటలతో ఉండాలని పూజలు నిర్వహించిన్నట్లు తెలిపారు. అయితే ఆలయ నిర్మాణాలతో పాటు పిల్లల భవిష్యత్ బంగారు బాటలు వేసేవిధంగా పాటుపడాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబో యిన అశోక్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ కొత్తూరి రమేష్, హనుమకొండ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ మల్లేశం, సోమయ్య, వెంకన్న, బండి సతీష్, గ్రామ పెద్దలు, ముదిరాజ్‌లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించిన అధికారులు
- రూ.10 కోట్లకు పైగా ఆస్తి పత్రాలు స్వాధీనం



హనుమకొండలోని తస్లీమా నివాసంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 22 : గత నెల లంచం పుచ్చుకుంటూ ఏసీబీకి పట్టుబడి సస్పెండ్‌కు గురైన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా నివాసంలో సోమవారం ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు హనుమకొండలోని తస్లీమా నివాసంతోపాటు ఆమె భర్త గ్రామమైన నల్లగొండలో, భూపాలపల్లి పట్టణానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ నివాసంలో ఏకకాలంలో దాడులు చేశారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సోదాల్లో ప్రభుత్వ విలువ మేరకు రూ.2 కోట్ల 94 లక్షల 84 వేల 547 కాగా, బహిరంగ మార్కెట్ విలువ రూ.10 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. సోదాల్లో ఐదు ఇళ్లకు సంబంధించి పత్రాలు (రూ.2కోట్ల 7లక్షల 426), ఆరు ఖాళీ స్థలాలకు చెందిన పత్రాలు (రూ.12లక్షల 1500), మూడు ఎకరాల స్థలం పత్రం (రూ.20లక్షల 40వేలు), నెట్ క్యాష్ రూ. లక్ష 92వేల 900, బ్యాంక్ బ్యాలెన్స్ రూ.98వేల 787, ఇంట్లో వస్తువులు (రూ.9 లక్షల 4,800), వాహనాలు (రూ.23లక్షల 66,218) తదితరాలకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తస్లీమాకు బెయిల్ పిటిషన్ వేసే క్రమంలో ఈ దాడులు జరగడం విశేషం. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు మరో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. మొత్తంగా సస్పెన్షన్‌కు గురై జైల్లో ఉన్న క్రమంలో ఆమె నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహించడం రిజిస్ట్రేషన్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

గాలివాన బీభత్సం

- మామిడి తోటలకు అపార నష్టం
- జిల్లాలో 1874 ఎకరాల్లో నేలరాలిన కాయలు
- రూ.1.34 కోట్లు నష్టమని ఉద్యానశాఖ ప్రాథమిక అంచనా



బయ్యారం కోటగడ్డలో నేలరాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మరియన్న



డోర్నకల్ మల్లయ్యకుంట తండాలో గాలికి ధ్వంసమైన రేకులషెడ్డు



బేతోలులో స్వరూపకు చెందిన ఇంటి పైకప్పు ఎగిరిపోయిన దృశ్యం



గార్లలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 22 : అన్నదాతలను గాలులతో కూడిన వర్షం తీరని దెబ్బ తీసింది. మహబూబాబాద్ జిల్లాలో ఆదివారం రాత్రి బలమైన ఈదురుగాలులు వీయడంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వానపడింది. గాలుల తీవ్రతతో మామిడి తోటలకు అపార నష్టం కలిగించింది. మామిడి కాయలు చేతికి వచ్చి.. కోతకు వచ్చిన సమయంలో గాలిదుమారం వీయడంతో జిల్లాలోని ఏడు మండలాల్లో మామిడి తోటలకు తీరని నష్టం జరిగింది. దీంతో రైతులు బోరుమంటున్నారు. పలుగ్రామాల్లో చెట్లు విరిగి స్తంభాలపై పడడంతో విద్యుత్ అంతరాయం కలిగింది. సంబంధిత అధికారులు, సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

రూ.1.34 కోట్లు నష్టమని ప్రాథమిక అంచనా..

జిల్లాలోని గార్ల, బయ్యారం, మరిపెడ, కురవి, డోర్నకల్, చిన్నగూడూరు, మహబూబాబాద్ మండలాల్లో 452మంది రైతులకు చెందిన 1874ఎకరాల్లో 7-8 టన్నుల మామిడి కాయలు రాలిపోయినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి మరియన్న తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం నష్టం రూ.1.34 కోట్లు ఉంటుందని చెప్పారు. వివిధ మండలాల్లో మండల ఉద్యానశాఖ అధికారులు విష్ణు, అరుణ్, అనితశ్రీలు వేర్వేరుగా నష్టం వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయి సర్వే అధికారులతో కలిసి సర్వే చేయడం జరుగుతుందన్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఆదివారం రాత్రి వీచిన గాలిదుమారం, అకాల వర్షాలతో పలు మండలాల్లో మామిడితోటలకు, ధాన్యం, మొక్కజొన్నతోటలకు నష్టం వాటిల్లింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఇండ్లు నేలమట్టమయ్యాయి. రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. మహబూబాబాద్ శివారు బేతోలులో గాలిదుమారంతో స్వరూపకు చెందిన ఇంటిరేకులు లేచిపోయి విరిగాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపోయాయి. మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. బయ్యారం మండలంలో కాకతీయనగర్ సమీపంలోని రోడ్డుపై చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో వైర్లుతెగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏజెన్సీ గ్రామాల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పలు ఇండ్ల కప్పులు, రేకుల షెడ్లులు లేచిపోయాయి. గార్ల మండలంలోని మద్దివంచ, సీతంపేట, రాంపురం, బుద్దారంగ్రామాల్లోని వంద ఎకరాల్లో మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. మర్రిగూడెం, శేరిగూడెం పొలాల్లో వరి కోసి అరబట్టిగా వచ్చిన అకాల వర్షానికి తడిసిపోయాయి. సత్యనారా యణపురంలో రెండుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దంతాలపల్లి మండలంలో ఆగపేట-దంతాలపల్లి మధ్య భారీ వృక్షం కూలిపోయాయి. దంతాలపల్లి-ముప్పారం, దాట్ల, కుమ్మరికుంట్ల, ఆగపేటలోని మామిడి తోటల్లో కాయలు రాలాయి. డోర్నకల్‌లో చిల్కోడు, గొల్లచర్లలో కొద్దిపాటిగా మామిడికాయలు రాలాయి. మల్లయ్యకుంట తండాలో బానోత్ శంకర్ అనే రైతుకు చెందిన ఓ కోళ్ల ఫారం రేకులషెడ్డు కూలిపోయి పూర్తిగా నేలమట్టమైంది. ముల్కలపల్లి, గొల్లచర్లలో రోడ్డుపై చెట్లు విరగిపడ్డాయి. ఉయ్యాలవాడలో ఓ కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. సీరోలు మండలంలో చింతపల్లి క్రాస్‌రోడ్డు ఓ చెట్టు కూలిపోయింది. మరిపెడ బంగ్లాకు వెళ్తున్న డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ చూసి స్థానికులను పిలిపించి చెట్టును తొలగించారు. ఎవరికైనా ప్రమాదం జరిగిందా అని తండవాసులను యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గూడూరులో గాలిదుమారం మాత్రమే ఉంది. కేసముద్రం, తాళ్లపూసపల్లి మధ్య పలు చెట్లు విరిగిపోయి రోడ్లపై పడ్డాయి. కురవిలో ఓ గంట వరకు రాళ్లవాన కురిసింది. మరిపెడలో అకాల వర్షం కురిసింది. మామిడి తోటలను మండల ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి నష్టం వివరాలు సేకరిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద చెట్టు కూలడంతో లక్ష్మణ్ అనే యువకుడికి గాయాలయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. అనేక గ్రామాల్లో ఇంటిపైకప్పుల రేకులు ఎగిరిపోయాయి. మరిపెడ మండలంలో కూడ మామిడి తోటలను ఉద్యానశాఖ అధికారులు సర్వే చేస్తున్నారు. కాగా, మిగతా మండలాల్లో గాలిదుమారం లేదు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో బలమైన గాలులు లేకపోవడంతో భారీ నష్టం జరుగలేదు.


చికత్స పొందుతూ పంచాయతీ కార్యదర్శి మృతి

గణపురం, ఏప్రిల్ 22: ఆత్మహత్యయత్నం చేసిన మండలంలోని కర్కపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణి (32) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని కర్కపల్లిలో పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న పల్లెబోయిన శ్రావణి ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. అప్పుడే ఇంట్లోకి వచ్చిన భర్త నరేష్ ఉరిని తొలగించి వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో శ్రావణి తుది శ్వాస విడిచారు. శ్రావణికి నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. ఆమె ఆత్మహత్యకు కుటుంబ కలహాలా... వృత్తి పరమైన పని ఒత్తిడా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఉద్దండుల అడ్డా!

ప్రతీ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇచ్చిన వరంగల్ ఓటర్లు

మహామహులను అందించిన ఓరుగల్లు కోట



వివరాలు 8లో..

29 నుంచి మే 22 వరకు గోల్కొండ, ఇంటర్ సిటీ రద్దు

గిర్మాజీపేట, ఏప్రిల్ 22: సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో సోమవారం నుంచి ప్రారంభమై మే 26 వరకు జరిగే రోలింగ్ కారిడార్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29 నుంచి మే 22వ తేదీ వరకు వరంగల్ మీదుగా సికింద్రాబాద్, గుంటూరు వెళ్లే గోల్కొండ, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సోమవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ప్రతీ రోజు వరంగల్ మీదుగా సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 29 నుంచి మే 10 వరకు, తిరిగి మే 16 నుంచి మే 22 వరకు రద్దు చేసినట్లు తెలిపింది.

సికింద్రాబాద్-తిరుపతి రైళ్లు 28 నుంచి రద్దు

ప్రతి ఆదివారం తిరుపతి నుంచి వరంగల్ మీదుగా సికింద్రాబాద్ వెళ్లే, ప్రతి సోమవారం సికింద్రాబాద్ నుంచి వరంగల్ మీదుగా తిరుపతి వెళ్లే సికింద్రాబాద్-తిరుపతి ఏసీ స్పెషల్ రైళ్లను 28 నుంచి మే 6 వరకు, మే 19, 20 తేదీల్లో రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే వరంగల్ మీదుగా ప్రతి శనివారం నర్సాపూర్ నుంచి హైదరాబాద్, ప్రతి ఆదివారం హైదరాబాద్ నుంచి నర్సాపూర్ వెళ్లే ప్రత్యేక రైళ్లను కూడా మే 4 నుంచి 12 వరకు, మే 18, 19 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు.

ఫార్మసీ ప్రాక్టికల్స్‌పై వివాదం

- వర్సిటీ క్యాంపస్‌ను కాదని ప్రైవేట్ కళాశాలలో నిర్వహణ
- వర్సిటీ పరీక్షల విభాగంపై విమర్శలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 22 : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో మరోసారి వివాదం నెలకొంది. ఫార్మసీ ప్రాక్టికల్స్ వర్సిటీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో కాకుండా ప్రైవేట్ కళాశాలలో నిర్వహించడం వివాదాస్పదమైంది. ఏప్రిల్ 18న మూడవ సెమిస్టర్ ఫార్మస్యూటికల్ ప్రాక్టికల్ పరీక్ష కేయూ ఫార్మసీ విభాగంలో జరిగగా. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వెళ్లి తనిఖీలు చేశారు. పరీక్షల్లో అవకతవకలు జరిగాయని భావించారు. తర్వాత అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి ఆయా ఫార్మసీ ప్రాక్టికల్స్ పరీక్షలను రద్దు చేశారు. అక్కడి వరకు బాగానే ఉన్న మళ్లీ అదే పరీక్షలను తిరిగి ఏప్రిల్ 22న సోమవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ ప్రైవేట్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించారు. అయితే వర్సిటీ క్యాంపస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలో పరీక్షలు నిర్వహించడం వివాదాస్పదమైంది. ఆయా ప్రైవేట్ అధ్యాపకులు ఎగ్జామినర్స్‌గా వ్యవహరించారు. క్యాంపస్‌లోని సీనియర్స్ ప్రొఫెసర్స్‌ను కాదని ప్రైవేట్ కళాశాల అధ్యాపకులైన ఎగ్జామినర్స్‌తో పరీక్షలు నిర్వహించడం పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే క్యాంపస్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు మళ్లీ క్యాంపస్‌లోనే నిర్వహించాలని అభ్యర్థించినప్పటికీ కావాలనే ప్రైవేట్ కళాశాలలో నిర్వహించారనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా వర్సిటీ క్యాంపస్ ఫార్మసీ కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్షలు రాసే విద్యార్థులకు సరైన కెమికల్స్‌తో పాటు ల్యాబ్ ఎక్విప్‌మెంట్‌లు కొనుగోలు చేయడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఫార్మసీ కళాశాలల అనుమతుల్లో అవకతవకలపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు సైతం అందాయి. ఫార్మసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలకు కావాల్సిన ల్యాబ్‌తో పాటు ఇతర ఎక్విప్‌మెంట్ సెయింట్ పీటర్స్ కళాశాలలో ఉన్నాయని అక్కడే ప్రాక్టికల్స్ పరీక్షల సెంటర్‌ను ఏర్పాటు చేశామని కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి తెలిపారు. అయితే కేయూ ఫార్మసీ విభాగం సూచనల మేరకే ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని స్పష్టం చేశారు.

నామినేషన్ కౌంటర్

నాలుగో రోజు (22-4-2024)

వరంగల్ (ఎస్సీ): కడియం కావ్య (కాంగ్రెస్), మారపల్లి సుధీర్‌కుమార్ (బీఆర్ఎస్), మేకల సుమన్ (ధర్మసమాజ్ పార్టీ), మచ్చ దేవేందర్ (వీసీకేపార్టీ), తాళ్లపల్లి వెంకటయ్య, ఈసంపెల్లి వేణు, మంద నరేశ్, శనిగరపు రమేశ్ (2 సెట్లు), బొచ్చు రాజు, పొంగుల అశోక్ (స్వతంత్ర)

మహబూబాబాద్ (ఎస్టీ): అజ్మీర సీతారం నాయక్ (బీజేపీ), పగిడి ఎర్రయ్య (యూసీసీఆర్ఐఎంఎల్), పాల్వంచ దుర్గ (స్వతంత్ర), మైపతి అరుణ్‌కుమార్ (స్వతంత్ర)

దాఖలైన మొత్తం నామినేషన్లు	వరంగల్	మహ-బాద్
	22	10



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 22 : వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 56వ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం హనుమకొండలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చేరికల కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే నాగరాజు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, ఎన్ఎస్‌యుఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీశ్, పూర్ణచందర్, రమేశ్‌గౌడ్, జనార్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ఉద్దండుల అడ్డా



అసెంబ్లీ సెగ్మెంట్లు ఇవే..

వరంగల్ లోకసభ స్థానంలో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ వర్ధన్నటపేట, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, పరకాల, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటి పరిధిలో కొత్తగా నమోదైన ఓటర్లను కలుపుకొని మొత్తం 18,16,543 మంది ఓటర్లున్నారు.

హనుమకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల సుపరిపాలనకైనా.. కాకలుతీరిన రాజకీయానికైనా.. కదిలించే పోరాటానికైనా.. చైతన్య వేదిక వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం. 1952లో ఏర్పాటైన ఈ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికలతో కలిపి ఇప్పటి వరకు 20 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఏడు సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ మూడు సార్లు టీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు. పీడీఎఫ్, సీపీఐ, టీజేఎస్, బీఎల్‌డీ, జనతా, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఒక్కోసారి గెలిచారు. ఇలా.. వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఓటర్లు అన్ని పార్టీలను అక్కున చేర్చుకున్నారు. తమ విలక్షణమైన తీర్పు ద్వారా ఆదరించారు. వరంగల్ లోక్‌సభ స్థానం ఒక్కప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట. రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా ఓటర్లూ స్పందించారు. ఆ తర్వాత టీడీపీకి, తదనంతరం టీఆర్ఎస్‌కు పెద్దపీట వేశారు. తమకు నచ్చిన అభ్యర్థిని, పార్టీని ఒకటి కన్నా ఎక్కువ సార్లు గెలిపించారు. నచ్చనివారిని ఒక సారికే ఇంటికి పంపారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి రామహాయం సురేందర్‌రెడ్డి మూడు సార్లు గెలిచారు. ఎస్టీ గిరి, చందూలాల్, పసునూరి దయాకర్‌ను రెండేసిసార్లు లోక్‌సభకు పంపారు.

1957లో ఏర్పాటు

1952లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం ఏర్పాటైంది. అప్పుడు తొలిసారి జరిగిన ఎన్నికల్లో పీడీఎఫ్ పక్షాన పెండ్యాల రాఘవరావు.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ప్రజాకవి కాళోజీ నారాయణరావుపై విజయం సాధించారు. 1957 ఎన్నికల్లో ఎస్ఏ ఖాన్ (కాంగ్రెస్), 1962 ఎన్నికల్లో బీఏ మీర్జా (కాంగ్రెస్), 1967లో రామసహాయం సురేందర్‌రెడ్డి (కాంగ్రెస్) 1971, 1977లో ఎస్టీ గిరి ఒకసారి కాంగ్రెస్, ఒకసారి టీపీఎస్ పక్షాన గెలిచారు. 1979లో జరిగిన ఉప ఎన్నికల్లో గండి మల్లికార్జున్‌రావు (కాంగ్రెస్ ఐ), 1980లో కమాలొద్దీన్ అహ్మద్ (కాం గ్రెస్ ఐ), 1984లో టి.కల్పనా దేవి (టీడీపీ) 1989లో, 1991, ఎన్నికల్లో రెండు సార్లు రామసహాయం సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) 1996, 1998 ఎన్నికల్లో ఆజ్మీరా చందూలాల్ (టీడీపీ), 1999 ఎన్నికల్లో బోడకుంటి వెంకటేశ్వర్లు (టీడీపీ) ఎన్నికయ్యారు



పెండ్యాల రాఘవరావు | కమాలొద్దీన్ అహ్మద్ | టి. కల్పనాదేవి | అజ్మీరా చందూలాల్ | బి.వెంకటేశ్వర్లు

మారిన సీన్

2004లో నుంచి వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో సీన్ మారింది. తెలంగాణ ఉద్యమం ప్రభావం తో టీఆర్ఎస్ ఈ స్థానంలో తన బలాన్ని పెంచుకున్నది. 2004 ఎన్నికల్లో మొదటిసారి టీఆర్ఎస్ విజయం సాధించింది. ఆ పార్టీ పక్షాన డి.రవీంద్రనాయక్ పోటీ చేసి గెలుపొందారు. అయితే 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు టీడీపీ పక్షాన పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఏడాదికే 2009 ఎన్నికల్లో జరిగిన ఎన్నికల్లో సిరిసిల్ల రాజయ్య (కాంగ్రెస్) విజయం సాధించారు. 2014 నుంచి వరంగల్‌లో సీన్ మారిపోయింది. తెలంగాణ ఉద్యమంలో భాగంగా టీడీపీని వీడి టీఆర్ఎస్‌లోకి వచ్చిన సీనియర్ నేత కడియం శ్రీహరిని ఓరుగల్లు ఎంపీగా కేసీఆర్ బరిలో దించారు. అలా కడియం వరంగల్ గడ్డపై గులాబీ జెండాను రెపరెపలాడించారు. ఏకంగా 3.92 లక్షల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో కడియంకు 6.61 లక్షల ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్యకు 2 లక్షల ఓట్లు వచ్చాయి. అయితే ఎంపీగా బాధ్యతలు చేపట్టిన కొన్నాళ్లకే రాష్ట్ర రాజకీయాల్లో వచ్చిన మార్పులతో కడియం శ్రీహరి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఏడాది తిరక్కుండానే వరంగల్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికల జరిగింది. అప్పుడే పసునూరి దయాకర్‌కు అదృష్టం కలిసి వచ్చింది. దయాకర్‌కు 2015లో వరంగల్ లోక్‌సభ ఉప ఎన్నికలో పోటీకి టీఆర్ఎస్ అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. ఈ ఉప ఎన్నికల్లో దయాకర్ ఏకంగా 4.59 లక్షల ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. దయాకర్ మెజారిటీ తెలంగాణలో ఫస్ట్, బెస్ట్ రికార్డుగా నమోదైంది. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లో దయాకర్ టీఆర్ఎస్ నుంచి రెండోసారి అంతే ఘన విజయాన్ని సాధించారు.

> **కేంద్ర మంత్రులు**
>
> వరంగల్ లోక్‌సభ నుంచి పోటీ చేసి లోక్‌సభ అడుగుపెట్టిన అభ్యర్థుల్లో ఎవరూ కేంద్రమంత్రులుగా పదవిని అలంకరించకపోయినా రద్దయిన వరంగల్‌లోనూ, ఆ తర్వాత రద్దయిన హనుమకొండ లోక్‌సభ నుంచి పోటీ విజయం సాధించిన వారిలో కొందరు కేంద్ర మంత్రులుగా నియమితులయ్యారు. పీవీ నర్సింహారావు కేంద్ర మంత్రిగానే కాక, ఆ తర్వాత కాలంలో ప్రధాని పదవిని అధిష్ఠించారు. కమాలొద్దిన్ అహ్మద్ కూడా కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

మారిన సమీకరణలు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రభావం వరంగల్ లోక్‌సభ స్థానంపై కూడా పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగుతున్నందువల్ల ఈసారి ఎన్నికల్లో వరంగల్ కోటపై ఏపార్టీ జెండా ఎరుగుతుందోనన్న ఉత్కంఠ ప్రజల్లో నెలకొన్నది. బీఆర్ఎస్ నుంచి హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ బాబు పోటీలు ఉన్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పోటీకి దిగారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్య రంగంలో నిలబడ్డారు. ఈ నేపథ్యంలో వరంగల్ లోక్‌సభ నుంచి పోటీ ఈసారి రసవత్తరంగా ఉండబోతోంది. ఓరుగల్లు కోటపై ఏ పార్టీ జెండా ఎగుర వేస్తుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొన్నది.

సెగ్మెంట్ స్కాన్

- వరంగల్ లోక్‌సభ నియోజకవర్గానిది విలక్షణ తీర్పు
- ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట
- తర్వాత టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలకు పెద్ద పీట
- ప్రతీ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇచ్చిన ఓటర్లు
- మహామహులను అందించిన ఓరుగల్లు కోట
- తాజాగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల పోటాపోటీ

హనుమకొండ లోక్‌సభ స్థానం రద్దు

దేశానికి ప్రధానిగా సేవలు అందించిన పీవీ నర్సింహారావు ప్రాతినిధ్యం వహించిన హనుమకొండ నియోజకవర్గం 2009 నుంచి రద్దయింది. 1977 నుంచి ఉన్న హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సైతం రెండు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 1977, 1980 ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన పీవీ నర్సింహారావు పోటీ చేసి పిజనార్దన్‌రెడ్డిపై రెండు సార్లు విజయం సాధించారు. 1984లో బీజేపీ అభ్యర్థి సి.జంగారెడ్డి పీవీ నర్సింహారావుపై విజయం సాదించారు. 1989, 1991, 1996, 1998 ఎన్నికల్లో కమాలొద్దీన్ అహ్మద్ (కాంగ్రెస్) వరుసగా నాలుగు సార్లు విజయం సాధించారు. 1985లో, 1999లో టీడీపీ పక్షాన చాడా సురేష్ రెడ్డి రెండు సార్లు, 2004 సాధారణ, 2008 ఉప ఎన్నికల్లో బోయినపల్లి వినోద్‌కుమార్ టీఆర్ఎస్ పక్షాన రెండు సార్లు గెలుపొందారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో హనుమకొండ లోక్‌సభ స్థానం రద్దయింది.

నియోజవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
స్టేషన్‌ఘనపూర్	1,24,769	1,28,282	02	2,53,053	290
పాలకుర్తి	1,25,952	1,28,496	13	2,54,461	294
పరకాల	1,07,752	1,13,865	02	2,21,619	239
వరంగల్ పశ్చిమ	1,38,607	1,43,251	16	2,81,874	244
వరంగల్ తూర్పు	1,24,809	1,31,634	339	256,782	230
వర్ధన్నపేట	1,33,778	1,38,929	17	2,72,724	278
భూపాలపల్లి	1,36,273	1,39,751	06	2,76,030	317
మొత్తం	8,91,940	9,24,208	395	18,16,543	1,892

నాలుగోరోజూ నామినేషన్ల సందడి

- వరంగల్‌కు 11, మానుకోటలో నాలుగు నామినేషన్లు
- నామినేషన్ వేసిన కడియం కావ్య, సుధీర్‌కుమార్, సీతారాంనాయక్





వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారపల్లి సుధీర్ కుమార్, నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య



మహబూబాబాద్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్ సింగ్‌కు నామినేషన్ పత్రాలను అందిస్తున్న బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్

వరంగల్ కలెక్టరేట్ / మహబూబాబాద్ టౌన్ / వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం ఉత్సాహంగా సాగుతోంది. నాలుగోరోజైన సోమవారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి 11 నామినేషన్లు దాఖలవగా మహబూబాబాద్ స్థానానికికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్‌లో కాం గ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులతోపాటు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు, విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ, ధర్మసమా జ్ పార్టీ నుంచి ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. వరంగల్ కలెక్టరేట్‌లో పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాల ను స్వీకరించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపల్లి సుధీర్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య, విడుతలై చిరుతైగల్ కచ్చిపార్టీ నుంచి మచ్చ దేవేందర్, స్వతంత్ర అభ్యర్థులుగా తాళ్లపల్లి వెంకటయ్య, ఇసంపెల్లి వేణు, మంద నరేశ్, బొచ్చు రాజు, శనిగరపు రమేశ్ బాబు (రెండు సెట్లు), పొంగుల అశోక్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమ న్ ఈనెల 20న మొదటి సెట్ నామినేషన్ వేయగా, సోమవారం మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కాగా, బీజేపీ అభ్యర్థిగా అరూరి రమేశ్ బుధ వారం నామినేషన్ దాఖలు చేయనున్నట్టు తెలిసింది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా అజ్మీర సీతారాంనాయక్, స్వతంత్ర అభ్యర్థిగా పాల్వంచ దుర్గ, యూసీసీఆర్ఐఎంఎల్ అభ్యర్థిగా పగిడి ఎర్రయ్య, స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ నామినేషన్లు వేశారు. వారు మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో రిట ర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌కు తమ నామినేషన్ పత్రాలు అందించారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన పాల్వంచ దుర్గ ఈ నెల 19న కూడ ఒక సెట్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనా యక్ ఈ నెల 19న రెండు సెట్లు వేశారు. దీంతో ఇప్పటి వరకు ఎనిమిది మంది 10సెట్ల నామినేషన్లు వేశారు.

మంచి రోజు కావడంతో..

సోమవారం పౌర్ణమి తిథి ప్రవేశించడంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌తోపాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సందర్భంగా పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కాళోజీ జంక్షన్ వరకు ర్యాలీగా వచ్చారు. వరంగల్ కలెక్టరేట్ పరిసర ప్రాంతా లలో ఎన్నికల కోడ్ ఉండటంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులపై బారీకేడ్లు ఏ ర్పాటు చేసి నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లే అభ్య ర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే పోలీసులు అనుమతించారు.

> **రోడ్డుపైనే మీడియా సెంటర్ ..**
>
> వరంగల్ పార్లమెంట్‌కు అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడటానికి కలెక్టరేట్ బయట రోడ్డుపైనే మీడియా పాయింట్ ఏర్పాటు చేశారు. అసలే వేసవి కాలం పెద్ద సంఖ్యలో పోలీసులు, పెద్ద సంఖ్యలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ఉండడం పార్టీల అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, నాయకులు మీడియా పాయింట్‌లోనే సమావేశం నిర్వహించారు. తాగునీరు, తగినన్ని కుర్చీలు లేకపోవడంతో అంద రూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



కడియం కావ్య నామినేషన్ కార్యక్రమంలో సాంబయ్య, రామకృష్ణ తదితరులు

టికెట్ ఆశించినవారే కావ్యకు మద్దతుగా..

- చక్రం తిప్పుతున్న కడియం శ్రీహరి

వరంగల్ సిటీ, ఏప్రిల్ 22: వరంగల్ ఎంపీ సీటును ఆశించిన భంగపాటుకు గురైన ఆశావాహులే సోమవారం కాంగ్రెస్ అభ్యర్థిగా తొలి నామినేషన్ సెట్‌ను దాఖలు చేసిన కడియం కావ్యకు మద్దతుగా నిలువడం ఆసక్తిని కలిగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అయ్యాక వచ్చిన ఈ ఎన్నికలు ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. వరంగల్ ఎంపీ టికెట్ కోసం 40మంది దరఖాస్తు చేసుకున్నా, రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా ఉన్న దొమ్మాటి సాంబయ్యకు వస్తుందని అందరు అనుకున్నారు. అలాగే డాక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్న పెరుమాండ్ల రామకృష్ణ పేరు కూడా తెరపైకి వచ్చింది. అందరి ఊహలకు చెక్ పెడుతూ వ్యూహాత్మకంగా మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యకు పార్టీ టికెట్ కేటాయించారు. కావ్యకు ప్రకటించినప్పటి నుంచి అలుకబూనిన ఆశావాహులతో కడియం శ్రీహరి జరిపిన చర్చలు ఫలించాయి. ఈ నేపథ్యంలోనే కావ్య నామినేషన్ కార్యక్రమానికి దొమ్మాటి సాంబయ్య, పెరుమాండ్ల రామక్రిష్ణ హాజరయ్యారు. టికెట్ ఆశించిన ఆశావాహులు ఒక్కొక్కరిగా కడియం కావ్యకు మద్దతుగా నిలిచేందుకు ముందుకువస్తుండడంతో కాంగ్రెస్ క్యాడర్‌లో ఉత్సాహం ఉరుకలేస్తోంది. కాంగ్రెస్ టికెట్ ఆశించిన మిగితా ఆశావాహులతో కడియం శ్రీహరి చర్చలు జరుపతున్నట్లు సమాచారం.

ప్రతిష్టాత్మకంగా కాంగ్రెస్ జన జాతర సభ

- పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జన సమీకరణకు ఏర్పాట్లు : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి
- సభ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యేలు

మడికొండ, ఏప్రిల్ 22: మడికొండలో బుధవారం కాంగ్రెస్ జనజాతర సభను ప్రతిష్టాత్మంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కే. ఆర్. నాగరాజు, కడియం శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పార్టీ నేతలు కూచన రవళి తదితరులతో కలిసి సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా నాయిని విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24న వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్‌ను పురస్కరించుకొని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వరంగల్‌కు వస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా మడికొండలో జన జాతర సభను నిర్వహిసున్నామన్నారు. ముఖ్యమంత్రితో పాటు జిల్లా మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు ధనసరి అనసూయ(సీతక్క), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేంద్ర నేతలు దీపాదాస్ మున్షీ, రోహిత్ చౌదరి సభలో పాల్గొంటారని తెలిపారు. వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల నుంచి లక్ష మంది పైచిలుకు జన సమీకరణకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. సభకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని చోట్ల మంచినీటి వసతి కల్పిస్తున్నామన్నారు. సభా ప్రాంగణంలో రెండు లక్షల నీటి ప్యాకెట్లు, రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అలాగే ప్రతీ నియోజకవర్గం నుంచి వచ్చే వారికి విడివిడిగా పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే. ఆర్. నాగరాజు పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ సమస్యలు ఎదురు కాకుండా పర్యవేక్షిస్తారని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జిల్లాను ఆరు ముక్కలు చేయడంతో ఇరవై ఏళ్ళు వెనక్కి వెళ్లిందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి జన జాతర సభ దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుర్ర మోహన్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, గుర్రం అమర్‌నాథ్, పల్లపు రాజేందర్, ఏడబోయిన ప్రభాకర్, వస్కుల నాగరాజ్, వస్కుల శ్రీను, నీలం వేణు తదితరులు పాల్గొన్నారు.



సభ ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యేలు కె. ఆర్. నాగరాజ్, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

సీపీఐ ఎంఎల్ ద్వారానే పీడిత ప్రజలకు విముక్తి

● ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల్లో వక్తలు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 22 : దేశంలో పీడిత ప్రజల విముక్తికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ద్వారానే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న అన్నారు. ఎన్డీ 55వ ఆవిర్భావదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మహ బూబాబాద్ జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవనంపై ఎన్డీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ పీడీత ప్రజల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేశారని చెప్పారు. ఎన్డీ డివిజన్ నాయకులు హలావత్ లింగన్న, ఎస్‌కె.బాబన్న, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ మండలం కంబాలపల్లి, మొట్లతండా, బోడగుట తండాల్లో ఎన్డీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సబ్ డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.బాబన్న, లింగన్న, బాలు, వెంకన్న, జగన్, రాములు, సైదులు, కొమురయ్య, వెంకటేశ్వర్లు, కిషన్ పాల్గొన్నారు.

● కేసముద్రం : కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం న్యూడెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ పతాకాన్ని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాలుగు మండలాల సంయుక్త కార్యదర్శి కన్నంతరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆవిష్కరించారు ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల కట్టయ్య, బొమ్మగాని ఎల్లయ్య, జంపాల రాంప్రసాద్, పెరుమాళ్ల జానకిరాములు, జంపాల సాయికృష్ణ, బానోత్ సురాజ్, బాలాజి పాల్గొన్నారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్డీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న జెండా ఆవిష్కరించారు.


మహబూబాబాద్ భట్టు అంజయ్య భవనంలో ఎన్డీ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న

● నెల్లికుదురు : నెల్లికుదురుతో పాటు ఆలేరు, మేచరాజుపల్లి, దుర్గా భవాని తండాలలో సోమవారం సీపీఐ (ఎంల్)55వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. లెనిన్ 154వ జయంతిని పురస్కరిం చుకొని జెండాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి ముంజపంపెల్లి వీరన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ రూరల్ : ప్రపంచ వ్యాప్తంగా పీడీత ప్రజల శ్రమశక్తిని కొల్లగొడుతున్న పెట్టుబడిదారి దోపిడీ వర్గంపై మార్క్సిజం అనే వజ్రాయుధంతో అంతం చేసిన మహనీయుడు లెనిన్ అని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న అన్నారు. లెనిన్ 154వ జయంతి, సీపీఐ(ఎంఎల్) 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పుర స్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాల యంలో సోమవారం వేడుకలను నిర్వహించారు. కొత్తపల్లి రవి, ఫైండ్ల యాకయ్య, ఉమగాని సత్యం, వీరన్న, రాజు పాల్గొన్నారు.

● కురవి : కురవి మండలం బంచరాయితండాలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ పతకాన్ని సీనియర్ నాయకులు బానోత్ రూప్లా ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన కురవిసబ్ డివిజన్ కార్యదర్శి సామ పాపయ్య మాట్లాడారు. ఎన్డీ నాయకులు లచ్చిరాం, పాష్ల, కేస్లీ, పూర్ణ పాల్గొన్నారు.

● తొర్రూరు : ప్రధాని నరేంద్రమోదీ రాజస్థాన్ ఎన్నికల ప్రచార బహిరంగ సభలో స్థాయిని మరచి మాట్లాడటం సరికాదని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సీపీఐఎంఎల్ 55వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆ పార్టీ 55వ ఆవిర్భావ దినోత్సవ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. వీరన్న, నవీన్, బాలు, షరీఫ్ పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 : జిల్లాలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో రామారావు అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి సోమవారం చీప్ సూపరిండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ...ఈ నెల 25 నుంచి మే 2 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కొనసాగనున్నాయని తెలిపారు. ఓపెన్ టెన్త్ పరీక్షలకు 602 మంది హాజరు కానుండగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మానుకోట మునిసిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను కేటాయించినట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలకు 761 మంది హాజరుకానుండగా జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ స్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఏసీజీఈ మందుల శ్రీరాములు, సీఎస్, డీవోలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జోనల్ కార్యాలయ జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్

సీరోలు, ఏప్రిల్ 22 : బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ బ్యాంకు అభివృద్ధికి ప్రజలు సహకరించాలని హైదరాబాద్ జోనల్ కార్యాలయం జనరల్ మేనేజరు అజయ్‌కుమార్ అన్నారు. సీరోలు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన యూనియన్ బ్యాంకు భవనాన్ని సోమవారం హైదరాబాద్ హైదరాబాద్ యూనియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయ జనరల్ మేనేజరు అజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం బ్యాంకు పనిచేస్తుందని, ఖాతాదారులు, ప్రజలు బ్యాంకుద్వారా అందించే రుణాలు మొదలగు సేవలను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 1.50 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం అజయ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజనల్ మేనేజరు పలుగుల సత్యం, వరంగల్ డిప్యూటీ జనరల్ మేనేజరు మహేష్, శ్రీ శివాలయ ట్రస్టు చైర్మన్ వెడవెల్లి హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెడవెల్లి వెంకట్‌రెడ్డి, బ్యాంకు మేనేజరు గుగులోతు సంతులాల్, ఏపీఎం సత్యనారాయణ, మహిళా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.


సీరోలులో బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న అజయ్‌కుమార్

వీరభద్రుడి సన్నిధిలో సీతారాంనాయక్ పూజలు

కురవి, ఏప్రిల్ 22 :మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ కురవి శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీగా నామినేషన్ వేయడానికి ముందు వీరభద్రస్వామి సన్నిధిలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ ఎంపీగా తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మండల అధ్యక్షులు ఎస్వీఎన్ రాజు, కొంతం పెంటయ్య, గుగులోతు రాంబాబు, గడ్డం అశోక్, బోగ అనిల్, బుక్క శంకర్‌రావు పాల్గొన్నారు.


ఆలయంలో పూజల్లో పాల్గొన్న సీతారాంనాయక్

బలరాంనాయక్ గెలుపే లక్ష్యం

గూడూరు, ఏప్రిల్ 22 :మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనావత్ రాధ పిలుపునిచ్చారు. గూడూరు మండలం తీగలవే ణిలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి, వైస్ చైర్మన్ వేం శ్రీనివాసరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు యాకూబ్‌పాషా, మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, జ్యోతి, జితేందర్‌రెడ్డి, లక్ష్మణ్, నవీన్, వీరన్న, దామోదర్‌రెడ్డి, యాకాంబ్రం, కన్నబోయిన వెంకన్న, హెచ్.శివ, ప్రవీన్, కల్యాణ్ పాల్గొన్నారు.


తీగలవేణిలో ప్రచారం చేస్తున్న రాధ, నాయకులు

కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న బీజేపీ

సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్


బయ్యారం పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

బయ్యారం, ఏప్రిల్ 22 :కేంద్ర ప్రభుత్వ సెక్టార్లను ప్రైవేటుపరం చేస్తూ దేశ సంపదను కొద్దిమంది చేతుల్లోనే ఉండే విధంగా కార్పోరేట్ శక్తులకు బీజేపీ దోచిపెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ఆరోపించారు. బయ్యారంలో సోమవారం నిడికొండ చంటి అధ్యక్షతన పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో అభివృద్ధి కంటే రైతులకు, కార్మికులకు చేసిన నష్టాలే ఎక్కువని అన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ హామీలను విస్మరించారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన బీజేపీకి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మండ రాజన్న, మండల కార్యదర్శి నంబూరు మధు, వల్లాల వెంకన్న, ఎస్‌కె.యాకూబ్, వెన్ను మోహన్, భిక్షం, పెంటయ్య, వెంకన్న, పురుషోత్తం, కన్నయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి

గార్ల ఏప్రిల్ 22 :మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెడెం కొమురయ్యగౌడ్ సోమవారం గుండె పోటుతో మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు తెలిపారు. కొమరయ్యగౌడ్ గ్రామంలో గౌడ సంఘంలో కీలక వ్యక్తి ఉంటూ సంఘం సమస్యలతో పాటు బీఆర్ఎస్ పార్టీలో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారు. తెల్లవారుజామున లేచి కొద్ది సేపు వాకింగ్ చేసి ఇంటికి వచ్చి పడుకున్నాడు. పడుకున్న వ్యక్తి ఎంత సేపటికీ లేవక పోవంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు స్థానిక డాక్టర్‌ను పిలిపించడంతో చనిపోయాడాని డాక్టర్ నిర్ధారించారు. కొమరయ్యగౌడ్ మృతి వార్త తెలుసుకున్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్, సీపీఎం, సీపీఐ నాయకులు కందునూరి శ్రీనివాస్ కట్టెబోయిన శ్రీనివాస్, టీపీసీసీ మాజీ సభ్యులు రావూరి వెంకట్రామయ్య, తాళ్లపల్లి కృష్ణాగౌడ్, బీఆర్ఎస్ డోర్నకల్ మండల అధ్యక్షులు నున్నా రమణ పాల్గొని కొమరయ్య భౌతికాయం పూల మాలవేసి నివాళులర్పించారు. కొమురయ్య సేవలను కొనియాడారు.

లింగనిర్ధారణ పరీక్ష చేసిన ఇద్దరు వైద్యులపై కేసు

నెక్కొండ, ఏప్రిల్ 22 : లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఇదదరు వైద్యులపై కేసు నమోదు చేస్తున్న నెక్కొండ ఎస్సై మహేందర్ సోమవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా మూడోసారి గర్భం ధరించడంతో పుట్టబోయేది ఆడ, మగ బిడ్డ అనే విషయం తెలుసుకునేందుకు నెక్కొండలోని ఉపేందర్ ఆస్పత్రికి వచ్చారు. ఈనెల 17 వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పార్థు ఆడపిల్లని నిర్ధారించాడు. దీంతో ఆ గర్భిణి అబార్షన్ చేయించుకొనుటకు నెక్కొండలోని శ్రీవెంకటేశ్వర గ్రామీణ వైద్యశాలకు రాగా, గ్రామీణ వైద్యుడు నమస్కారం అబార్షన్ చేశారు. వైద్యం సరిగా చేయకపోవడంతో ఆమెకు తీవ్ర రక్తస్రా వం జరిగి ప్రాణాపాయస్థితికి చేరుకోవడంతో చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు.

ఈ విషయమై విచారణ జరిపి గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బియమున నెక్కొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

బలరాంనాయక్ ప్రత్యేక పూజలు


దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠామహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి బలరాంనాయక్

కేసముద్రం, ఏప్రిల్ 22 : కేసముద్రం మండలం బేరువాడలో దుర్గమ్మ గుడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, మాజీ జడ్పీటీసీ కదిరె సురేందర్, గంట సంజీవరెడ్డి, బండారు దయాకర్, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, గండి శ్రీనివాస్, మేకల వీరన్నయాదవ్, చిలువేరు సమ్మయ్యగౌడ్, బానోత్ వెంకన్న, రాంచంద్రు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 : విద్యార్థుల తల్లిదండ్రులతో ఈ నెల 23న సమావేశాలు నిర్వహించి వారి సమక్షంలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సోమవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాలల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ...ఈ నెల 24 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల మార్కుల జాబితాలను అందించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని వివరించాలన్నారు. వేసవిలో పిల్లలు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు జాగ్రత్తలు చెప్పాలని పేర్కొన్నారు. డీఈవో వెంట అసిస్టెంట్ స్టాటిస్టికల్ కో-ఆర్డినేటర్ సంతోష్, హెచ్‌ఎంలు గుగులోతు కిషన్‌నాయక్, సమ్మెట వెంకన్న, ఉపాధ్యాయులు రోజారాణి, ప్రభావతి, మహేశ్వర్, సరిత, మంజుల తదితరులు ఉన్నారు.


జమాండ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో రామారావు

మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలి

టీపీఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్ రమాదేవి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 22: మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర కో- కన్వీనర్ రమాదేవి పిలుపునిచ్చారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈ నెల 28న జరిగే రాష్ట్ర సదస్సు కరపత్రాలను స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ...దేశంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అత్యంత ఫాసిస్టు పాలన కొనసాగిస్తూ ప్రజల మధ్య అంతరాలు సృష్టిస్తుందని విమర్శించారు. దేశ సంపదను కొద్ది మంది కార్పోరేట్ శక్తుల చేతిలోకి వెళ్లే విధంగా కేంద్రప్రభుత్వ నిర్ణయాలు న్నాయని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన బాధ్యత ప్రగతిశీల శక్తులపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 28న మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో జరిగే సదస్సుకు వక్తలుగా ప్రొఫెసర్లు జి. హరగోపాల్, కాశీం, గడ్డం లక్ష్మణ్ హాజరవుతున్నారని పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. గుగులోతు కిషన్‌నాయక్, సంజీవరావు, ప్రశాంత్, ఎస్కే. బాబన్న, ఫైండ్ల యాక య్య, కళ్లెం వీరారెడ్డి, భూక్య సత్యనారాయణ, చిత్తారి సోమన్న, బోడ శ్రీను, లక్‌పతి, నరేష్, వెంకన్న, సందీప్, శ్రీనివాస్, గుంజే హన్మంతు పాల్గొన్నారు.


టీపీఎఫ్ రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రమాదేవి

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

కురవి, ఏప్రిల్ 22 :కురవి మండలం మోద్గులగూడెం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు రాసాల సింధుకీర్తి, రాగం ప్రణవిలు రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణచారి, పీఈటీ కాశీనాథ్ తెలిపారు. ఇటీవల మహబూబాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి సెలక్షన్స్‌లో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థినులు ఈ నెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు శ్రీరాములు, లత, దీపిక, సునిత, కిషన్, వీరయ్య, అనితరాణి, జ్యోత్స్నలు అభినందించారు.

ఒకేపాఠశాల నుంచి 16 మంది విద్యార్థులకు సీట్లు

ఇనుగుర్తి, ఏప్రిల్ 22 : ఒకే పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 16 మంది విద్యార్థులు ఆయా గురుకుల పాఠశాలలో సీట్లు పొందారు. ఇనుగుర్తి మండల కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రవేశం పొందినట్లు పాఠశాల కరస్పాండెంట్ గంజి వీరేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ పాఠశాల నుంచి మానస, నితిష, భావన, నవ్య, పల్లవి, ప్రియాంక, హర్షిణి, చరణ్, హరినాథ్, అరవింద్, శివరామకృష్ణ, సాత్విక్, చెర్రి, ప్రసాద్‌లు సీట్లు ఆయా గురుకుల పాఠశాలల్లో సీట్లు పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మురళీమోహన్, చంద్రమోహన్, భాస్కరచారి, అనిత, నిర్మల, అర్చన, స్వప్న, నీరజ విద్యార్థులను అభినందించారు.

పథకాల అమలుతో మోదీ గెలుపు ఖాయం

తొర్రూరు, ఏప్రిల్ 22 : దేశంలో, రాష్ట్రంలో ప్రధాని మోదీ పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలే మోదీ మరోసారి గెలుపునకు నాంది అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు అన్నారు. సోమవారం వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపుకోరుతూ పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు పల్లె కుమార్, జగదీష్, సందీప్, శేఖర్, రాజు, హరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవళి మనుగడ

పెద్దవంగర, ఏప్రిల్ 22 : మొక్కలు నాటితేనే మానవళి మనుగడ సాధ్యమని లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర మండల అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మొక్కలను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ సంచులు, కవర్ల స్థానంలో కాగితం, వస్త్రాలతో తయారుచేసిన వాటిని ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణను గుర్తించాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 22 : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని మహబూబాబాద్ మండలం అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కల్లెం వెంకట్‌రెడ్డి అన్నారు. ధరిత్రి దినోత్సవాన్నిపురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులు పర్యావరణాన్ని రక్షించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేశబోయిన వెంకన్న, కవిత, జనార్ధన్, శశిధర్, బలాష్టి రమేష్, వెంకటేష్, యుగేందర్, బాలాజీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కురవి, ఏప్రిల్ 22 : కురవి మండలం సూర్యతండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమం రెండోరోజు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రోచ్చరణల నడుమ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో ఒకరి ఆత్మహత్య


శ్రీను (ఫైల్)

మరిపెడ, ఏప్రిల్ 22 : కుటుంబ, ఆర్థిక సమస్యలతో పురుగు మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మరిపెడ మునిసిపాలిటీ పరిధి మాకుల తండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ తండాకు చెందిన ఇస్లావత్ శ్రీను (45) గత కొద్ది రోజులుగా మద్యానికి అలవాటుపడి కుటుంబాన్ని పట్టించుకోవట్లేదు. దీనికి తోడు ఆర్థిక సమస్యలతో సతమతవుతూ జీవితంపై విరక్తిచెంది తన ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఈ విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీను మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గు రు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటిపారుదల శాఖ డీఈఈపై విచారణ

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 22 జిల్లా నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) డీఈఈ కిశోర్‌పై వచ్చిన ఆరోపణలపై పాలకుర్తి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్‌బాబు విచారణ చేపట్టారు. సోమ వారం మహబూబాబాద్‌లోని ఇరిగేషన్ కార్యాలయంలో స్థానిక నెక్లెస్‌రోడ్‌లో నిజాం చెరువు మత్తడి వద్ద ఆయన విచారణ చేపట్టారు. గత కొద్దిరోజుల క్రితం 669 సర్వే నెంబర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా తమ పట్టాభూముల్లో అక్రమంగా మట్టిని తవ్వించి ప్రైవేట్ వ్యక్తులకు డీఈఈ కిశోర్ అమ్ముకున్నారని, నిజాం చెరువు మత్తడిని అక్రమంగా పెంచిన విషయాలపై గత కొద్దిరోజుల క్రితం తెలంగాణ ముస్లీం సంఘాల జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అహ్మద్‌ఖాన్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దాంతో చీఫ్ ఇంజనీర్ మహబూబాబాద్ డీఈఈపై విచారణకు ఆదేశించడంతో ఆయన సోమవారం ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ... డీఈఈ కిశోర్‌పై మరోసారి పూర్తిస్థాయి విచారణ జరిపించి ఉన్నతాధి కారులకు నివేదించడం జరుగుతుందని విచారణ అధికారి చెప్పినట్లు అహ్మద్‌ఖాన్ తెలిపారు.

లైన్‌తండాలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు, ఏప్రిల్ 22 :గూడూరు మండలం లైన్‌తండాలో దుర్గమాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అర్చకులు భానుప్రకాష్ ఆధ్వర్యంలో పలు రకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వాంకుడోతు కొమ్మాలు, అజ్మీర సురేష్, అజ్మీర రవీందర్, దేవ్‌సింగ్, మూడు సురేష్, రమణారెడ్డి, సంతులాల్, లింగభద్రు, మూడు ఈరు పాల్గొన్నారు.

శివాలయానికి వెండి కలశం బహూకరణ

గూడూరు, ఏప్రిల్ 22 :గూడూరు సనాతన శివాలయానికి అయోధ్యపురం గ్రామానికి చెందిన బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలు రూ.1.09లక్షలతో వెండి కలశం తయారు చేయించి శివాలయం చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. దక్షణభారతదేశంలోనే గూడూరు సనాతన శివాలయం అరుదైన గుర్తింపును కలిగి ఉందన్నారు. శివాలయంలో శివపార్వతులు, లింగంతో కూడుకున్న విగ్రహాలు ఉన్నాయని చెప్పారు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆగారెడ్డి, తులిసిరాంనాయక్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదికి ప్రముఖుల పరామర్శ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 22: మహబూబాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కొండపల్లి కేశవరావు సతీమణి సంధ్య(64) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఆమె మృతదేహాన్ని మానుకోటకు తరలించారు. విషయం తెలుసుకున్న మానుకోట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి సురేష్ బాబు, ప్రభుత్వ న్యాయవాది కొంపెల్లి వెంకటయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసర పద్మాకర్‌రెడ్డి, ఏజీపీ బోనగిరి ఆనంద్‌గుప్తా, మానుకోట ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్ నాయక్, డీఎస్.రెడ్యా నాయక్, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్యులు, న్యాయవాదులు, ప్రముఖులు మానుకోటలో సోమవారం సంధ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి ఆమె కుటుంబసభ్యులకు తమ సానూభూతి వ్యక్తం చేశారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు.


సంధ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు